క్లుప్తంగా

బలరామావతారంలో జగన్నాథుడు



సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు

మునగపాక : మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని జగన్నాథుడు ఆదివారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి జగన్నాథున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కాగా 17వ తేదీన జగన్నాథస్వామి పండగను ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో గంగాలమ్మ తల్లి గుడికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. మునగపాకకు చెందిన సూరిశెట్టి కన్నారావు–లక్ష్మీ కాంతం దంపతులు రూ.20,116 నగదును ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు మాట్లాడుతూ గంగాలమ్మతల్లి గుడి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులకు భోజన సదుపాయం



ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లకు భోజన సదుపాయాన్ని ప్రారంభిస్తున్న వెంకటేష్

నక్కపల్లి: స్థానిక 50 పడకల ఏరియా ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లుగా ఉన్న రోగులకు భోజన సదుపాయాన్ని ఆదివారం నుంచి ప్రారంభించారు. కొద్ది నెలలుగా ఇక్కడ కొనసాగుతున్న భోజన సదుపాయం నిలిచిపోయింది. బిల్లు చెల్లింపుల్లో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ భోజన సదుపాయాన్ని నిలిపివేసాడు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చొరవతో తిరిగి ఈ భోజన సదుపాయాన్ని ఆది వారం నుంచి పునః ప్రారంభించినట్లు ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. రోగులకు మధ్యాహ్నం ఆయన భోజనాన్ని అందజేశారు.

ఘనంగా లలితాంబిక అమ్మవారి పండగ



రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని దిమిలి గ్రామంలో లలితాంబిక అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పండగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

ఎస్.రాయవరం : ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ఉపాధ్యాయులకు అనుకూలంగా జీపీఎస్ విధానం గెజిట్‌ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.ఎల్.ఎన్ ధర్మారావు , ఎస్.దుర్గాప్రసాద్ అన్నారు. అడ్డురోడ్డులో ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసే జీవోలు రద్దు చేయకుంటే ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ బాట పట్టే ఆలోచన చేస్తామన్నారు.

పచ్చదనంపై వేటు

- మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ శాఖ జంగిల్ క్లియరెన్స్ పనులు
- కొమ్మలకు బదులు విచ్చలవిడిగా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు



కట్టుపాలెం గ్రామం వద్ద రోడ్డు పక్కన నరికివేసిన చెట్లు

యలమంచిలి : విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా (ప్రి మాన్‌సూన్)లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు చేపట్టిన జంగిల్ క్లియరన్స్ పనుల్లో పర్యవేక్షణ కొరవడింది. ఈ పనులు గుత్తేదారు, విద్యుత్ శాఖ అధికారులు లోపాయికారి ఒప్పందంతో పచ్చని చెట్లు నరికి కలపను తరలించుకుపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఇదేంటని ప్రశ్నించినా తమ పై చర్యలు ఉండవన్న ధీమాతో దర్జాగా కలపను వ్యానుపై తరలించి లాభపడ్డారు. ఫలితంగా పచ్చని చెట్లు నరికివేతకు గురయ్యాయి. యలమంచిలి మున్సిపాలిటీ కట్టుపాలెం, సోమలింగపాలెం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు విద్యుత్ శాఖ అధికారులు జంగిల్ క్లియరన్స్ పేరుతో నరికివేసి వ్యానుల్లో తరలించుకుపాయారని స్థానిక ప్రజాప్రతినిధులు ఇటీవల యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. ఈ విషయంపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులపై చైర్‌పర్సన్ రమాకుమారి, డిఈ వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్లు తొలగించాల్సి వస్తే మున్సిపల్ అధికారులను సంప్రదించాలి కానీ జంగిల్ క్లియరన్స్ పేరుతో ఇలా చెట్లు తొలగించడమేమిటి? అని సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులను నిలదీయగా వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిందిగా చైర్‌పర్సన్ అధికారులకు ఆదేశించారు. అలాగే ఇటీవల యలమంచిలి మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా అనవసరంగా చెట్లు నరికితే ఉపేక్షించేది లేదని, ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా జరిగితే అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా అధికారులు ఇష్టానుసారం పట్టణంలో విద్యుత్ అంతరాయం పేరుతో ఎక్కడ పడితే అక్కడ చెట్లను తొలగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక బృందంతో జంగిల్ క్లియరెన్స్ పనులు

చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా చెట్లు నరికివేశారని స్థానిక ప్రజాప్రతినిధులు మున్సిపల్ సమావేశంలో మా దృష్టికి తీసుకురావడం వాస్తవమే. గ్రామీణ ప్రాంతాలకు 24 గంటలు విద్యుత్‌ను అందించాలనే తలంపుతో విద్యుత్ పోల్స్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరుగుతుంది. ఎక్కడా చెట్లు తొలగించలేదు. ఈ జంగిల్ క్లియరన్స్‌కు విద్యుత్ శాఖలో ప్రత్యేక టీం ఏడీఆర్ బృందంతో ప్రభుత్వం పనులు చేయిస్తోంది. కట్టుపాలెం వద్ద ఏడీఆర్ బృందమే పనులు చేపట్టిందని, దీనిపై మున్సిపల్ అధికారులను వారితో సంప్రదించాలని కోరాం.

–కనకరాజు, యలమంచిలి విద్యుత్ శాఖ ఏఈ

అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు



పాములవాకలో సరుగుడు మొక్కల్లో కలుపుతీత చేస్తున్న కూలీలు

కోటవురట్ల : అల్పపీడన ప్రభావంతో మండలంలో అడపాదడపా చిరుజల్లులు పడుతున్నాయి. రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి వర్షాలు కురుస్తున్నాయి. దాంతో రైతులు వ్యవసాయ పనుల్లో ముమ్మరంగా పాల్గొంటున్నారు. సరుగుడు, వరినారు మడుల్లో కలుపుతీత పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత వర్షాలు ఖరీఫ్ సాగుకు ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు. దాంతో పలు ప్రాంతాలలో వ్యవసాయ పనులు చురుగ్గా చేపడుతున్నారు. ఈ వర్షాలు నారుమడులు బాగా ఎదిగేందుకు దోహదపడతాయని సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



అన్నవరం గ్రామంలో రహదారి దుస్థితి

కోటవురట్ల : ఆ రహదారిలో ఆదమరిస్తే పరలోకానికి వెళ్లడం ఖాయం. చీకటిపడితే ఇక్కట్లే. అన్నవరం గ్రామంలో రహదారి చాలా వరకు శిథిలమైంది. పెద్ద గోతులు పడడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నిండిపోయి వాహనదారులు అంచనా తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. అడుగడుగునా గోతులమయం కావడంతో జాగ్రత్తగా వెళ్లకపోతే ఇంటికి వెళ్లే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కొత్తపెంట శివారులో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట పంచాయతీ శివారు కొత్తూరులో సూరెడ్డి వారి కల్లాలు వద్ద విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా మారాయి. పంట పొలాల మధ్యలో విద్యుత్ స్తంభాలు ఒక ప్రక్కకు ఒరిగిపోవడంతో పాటు, విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఇదే ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందింది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు చేపడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, తీగల విషయమై విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, తీగల్ని సరిచేయాలని కోరుతున్నారు.

మడుతూరు అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే సుందరపును సన్మానిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను మడుతూరులో ఆదివారం సన్మానించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తొలిసారిగా విచ్చేసిన ఆయనకు జనసేన పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మడుతూరు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చింతాలమ్మ గుడివకి రోడ్డు నిర్మాణం చేపడతానన్నారు. ఉమ్మడి జిల్లా పార్టీ కార్యదర్శి మోటూరు శ్రీవేణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఆశాజనకంగా ఆరుతడి పంటలు



ఏపుగా ఎదిగి, కాపుకొచ్చిన పెసర చేను

రోలుగుంట: మండలంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది రైతులు ఆరుతడి పంటలు సాగు చేపట్టారు. జానకిరాంపురం, కుసుర్లపూడి, రోలుగుంట, కొండపాలెం, శరబవరం, భోగాపురం, వడ్డిప తదితర గ్రామాల్లో మినుము, నువ్వు, పెసర, బొబ్బర తదితర ఆరుతడి పంటలు వేశారు. కొండపాలెం, భోగాపురం గ్రామాల్లో మినహా మిగిలి గ్రామాల్లో పంట ఏపుగా ఎదిగి, కాపుకొచ్చింది. ఈ పంటల దిగుబడిపై రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆరుతడి పంటలకు దుక్కులు చేసి, విత్తనాలు చల్లుకుంటే చాలని, కూలీతో పని లేకుండా కుటుంబ సభ్యులకు పని సరిపోతుందని చెప్పున్నారు. ఈ ఏడాది దిగుబడులు మెరుగ్గానే ఉంటాయని, పెట్టుబడులు పోను ఆదాయం బాగానే ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వర్షాలతో తీరిన పశుగ్రాసం కొరత



వర్షాలకు పచ్చగా దర్శనమిస్తున్న పచ్చిక బయళ్లు

మాకవరపాలెం: వర్షాలతో పశుగ్రాసం కొరత తీరనుంది. మూడు నెలలుగా కాస్తున్న భారీ ఎండల కారణంగా పచ్చగా ఉండే బీడులు ఎండిపోయాయి. దీంతో పశువులు గ్రాసం లేక ఇబ్బందులు పడేవి. అధిక ధరకు రైతులు గ్రాసాన్ని కొలుగోలు చేసుకోవాల్సివచ్చేది. ఈ పరిస్థితుల్లో ఇటీవల కురుస్తున్న వర్షాలతో పచ్చికబయళ్లు పచ్చగా దర్శనమిస్తున్నాయి. దీంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికేతరుల ఆక్రమణలపై రైతుల నిరసన



శింగవరంలో భూ ఆక్రమణలను తొలగించాలని నినాదాలు చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట: మండలంలోని శింగవరం రెవెన్యూలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన స్థానికేతరులను ఆ భూముల నుంచి తొలగించాలని గ్రామ రైతులు ఆదివారం నిరసనకు దిగారు. గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రేజం నాగు, పాల సంఘం అధ్యక్షుడు వేపాడ పెద సత్తిబాబు, రైతు సంఘ నాయకులు వేపాడ చిన సత్తిబాబు, వేపాడ మధు, ఈశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో శింగవరంలోని ఆక్రమణలకు గురైన భూముల వద్ద ఆందోళన చేపట్టారు. తమ గ్రామంలో ఉన్న సర్వే నెం.60లో 380 ఎకరాల ప్రభుత్వ భూమిలో సుమారు 100 ఎకరాలు స్థానికేతరులు ఆక్రమించినట్లు ఆరోపించారు. గెడ్డలు, వాగులను జేసీబీలతో చదును చేయించి రహదారులను మూసివేస్తున్నారని పేర్కొన్నారు. స్థానికేతరులైన బడాబాబుల్ని ఈ ఆక్రమిత భూముల నుంచి తొలగించి, వాటిని నిరుపేదలకు కేటాయించాలని కోరారు.

'ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

కె.కోటపాడు: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన కొండబాబు డిమాండ్ చేశారు. కె.కోటపాడులో ఆదివారం పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేసి, అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మండలంలో పాతవలస నుంచి సూదివలస రహదారిని తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆగస్టు 6న నర్సీపట్నంలో నిర్వహించనున్నట్లు దొరబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు, గొర్లె దేముడు బాబు, పొంతపల్లి రామారావు, రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

'రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి'



వడ్డాదిలో యువకులతో మాట్లాడుతున్న వినోద్‌బాబు

బుచ్చెయ్యపేట: అక్టోబర్ 2న వడ్డాదిలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్‌బాబు యువతకు పిలుపు నిచ్చారు. ఆదివారం వడ్డాదిలో జిమ్ వద్ద అమ్మ హెల్పింగ్ హార్ట్స్ యువత, సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా గాంధీ జయంతి రోజున అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఏర్పాటు చేసిన శిబిరం ద్వారా 567 యూనిట్ల రక్తం సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది వెయ్యి యూనిట్ల రక్తం సేకరించేలా యువత ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు.

నేటి నుంచి సప్తాహ కార్యక్రమాలు

గురు పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు



మునగపాకలోని సాయిబాబా ఆలయం

మునగపాక: మండల కేంద్రంలో సాయిబాబా ఆలయంలో ఈ నెల 15 నుంచి సప్తాహ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్ర తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి అఖండ జ్యోతి వెలిగించి ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి భజన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా నిర్వహించే భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే 21 వ తేదీన ఉదయం 5 గంటలకు హారతి, మేలుకొలుపు , 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహానైవేద్యం జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు వారం రోజుల పాటు జరిగే దైవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వీరేంద్ర కోరారు.

రాజగృహ విద్యానిలయం సేవలు అభినందనీయం



బహుమతులు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మువగపాక : విద్యాభివృద్ధికి రాజగృహ విద్యానిలయం అందిస్తున్న సేవలు అభినందనీయమని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కొనియాడారు. అరబుపాలెం రాజగృహ విద్యా నిలయంలో ఆధ్వర్యంలో డీఎస్ఆర్ అవార్డులను ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు పలువురు విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. రాజగృహ విద్యానిలయం నిర్వాహకులు డి.అచ్చియ్యానాయుడు, కులదీప్, నేస్తం ఫౌండేషన్ నిర్వాహకులు గార సత్యనారాయణ, మాజీ సర్పంచ్ లంబా అప్పారావు, పీఎంసీ చైర్మన్ మహేష్, బాలగణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బస్‌కాంప్లెక్స్ వద్ద పారిశుద్ధ్యలోపం

- యథేచ్ఛగా చేపల విక్రయాలు, డ్రైనేజీల్లో వ్యర్థాలు
- మున్సిపల్ కౌన్సిల్ వద్దన్నా పట్టని అధికారులు
- దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు




ఆదివారం యలమంచిలి బస్ కాంప్లెక్స్ వద్ద చేపల విక్రయాలు



చేపలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

యలమంచిలి రూరల్ : పరిశుభ్రంగా ఉండే బస్ కాంప్లెక్స్ వద్ద విచ్చలవిడిగా చేపల అమ్మకాలు యధేచ్ఛగా జరిగిపోతున్నాయి.ఈ నెల 12న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి సహా వార్డు కౌన్సిలర్లు ఇక్కడ చేపల అమ్మకాలు జరపడానికి వీల్లేదంటూ తీర్మానించారు. సమావేశంలో ఈ విషయంపై చర్చ జరుగుతున్నప్పుడే మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావును పిలిచి చేపలు, మాంసం వంటివి విక్రయించడానికి ప్రత్యేకంగా చేపల మార్కెట్ ఉండగా బస్ కాంప్లెక్స్ వద్ద చేపల విక్రయాలేమిటని అడిగారు. వెంటనే అక్కడ చేపల విక్రయాలు నిలిపివేయించాలని రమాకుమారి ఆదేశించారు. అయినప్పటికీ అక్కడ ఎప్పటిలాగానే ఆదివారం కూడా చేపల విక్రయాలు దర్జాగా జరిగిపోయాయి. కొందరు మహిళలు ఇక్కడకు చేపలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. వ్యర్థాలను పక్కనే ఉన్న డ్రైనేజీలో పడేస్తున్నారు. దీంతో అక్కడ దుర్గంధం వస్తోందని ఆటోవాలాలు, సమీప దుకాణదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. చైర్ పర్సన్,వార్డు కౌన్సిలర్లు వద్దని చెప్పినా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేపల అమ్మకాలపై మాత్రం చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. దిమిలి రోడ్డు కూడలికి సమీపంలో కూరగాయల మార్కెట్ వెనుక వైపు చేపలు, మాంసం విక్రయాలకు చోటు కల్పించారు. అయినప్పటికీ పట్టణంలో ఇతర ప్రాంతాల్లో చేపల విక్రయాలను అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో పారిశుధ్యం లోపిస్తోంది. డ్రైనేజీల్లో వ్యర్థాలను వేయడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ విషయంపై ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ వద్ద ప్రస్తావించగా బస్ కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలను నిలిపివేయడానికి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

• కారు మబ్బులు కమ్ముతు ఉంటే..



రోలుగుంటలో కనువిందు చేస్తున్న మేఘాలు

పచ్చకోక కట్టుకున్న నేల తల్లి. కొండగాలికి ఆనందంగా తలలూపే చెట్లు. ఆకాశాన్ని కమ్ముకుంటున్న కరి మబ్బులు.. ఆస్వాదించే మనసుండాలే గానీ..ప్రకృతికి మించిన ఆనందం మరెక్కడా దొరకదంటే అతిశయోక్తి కాదు. కొన్నాళ్లుగా వేసవిని తలపించేలా కాసిన ఎండలతో ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసిన వరి నారు మడుల్ని చూసి రైతులు ఆందోళన చెందారు. తాజాగా కురుస్తున్న వర్షాలతో రోలుగుంట, కొవ్వూరు, నిండుగొండ, వెలంకాయపాలెం తదితర గ్రామాల్లో ఆకుమడులు పచ్చగా పెరిగాయి. దీంతో నేలంతా పాదువుకున్న పచ్చదనం, ఆకాశంలో కరి మబ్బుల దోబూచులాట చూపరుల్ని కనువిందు చేస్తున్నాయి. – రోలుగుంట

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా గంటి రవికుమార్

అనకాపల్లి: అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా గంటి రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా పేరూరీ భోగలింగం, ప్రధాన కార్యదర్శిగా పి.వి.మల్లికార్జున రావు, కార్యదర్శులుగా మల్లేశ్వరరావు, ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా ఫణి సుబ్రహ్మణ్యం, దొరబాబు, సురేష్, కోశాధికారిగా కామేష్, సహాయ కోశాధికారిగా సోమశేఖర్, తమ్మి రాజు, శ్యాంకుమార్, గౌరవాధ్యక్షులుగా కన్నేపల్లి గౌరీపతిశర్మ, రేజేటి రామాచార్యులు, కె.విశ్వనాథం, కార్యవర్గ సభ్యులుగా కుమార్, విశ్వనాథం, చావలి రమేష్, బమ్మిడిపాటి కిరణ్, పూజ్యం నాగబాబు, కొడుకుల శ్రీకాంత్, కామేశ్వరరావు, బుల్లిసు, భాస్కరరావు, శేఖర్, శ్రీనివాసరావు, నాని, భాస్కరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గంటి రవికుమార్ మాట్లాడుతూ కొత్త కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు. గౌరీపతిశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులంతా ఐకమత్యంగా ఉంటూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.